


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 574 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 01 శనివారం నవంబరు 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

# మొంథా తుపానుతో నష్టపోయిన
# ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి

- కాకినాడ జిల్లా పరిధిలో పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించండి
- తీర ప్రాంత గ్రామాల రక్షణపై బృహత్ ప్రణాళిక- పంట నష్టపోయిన ప్రతి రైతుకీ న్యాయం జరగాలి
- పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితిపై ఆరా- ఏలేరు కాలువ గట్టు పటిష్టతకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
- మల్లవరం పత్తి రైతులకు న్యాయం చేయాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్

తుపాను అనంతర ఉపశమన చర్యలపై దిశానిర్దేశం

**మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, అక్టోబర్ 31 :**
కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ స్వాంతన కలిగించి, న్యాయం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ప్రకటించిన సాయం నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. సముద్రానికి అనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఆర్ఓ, ఆర్డీవోలు, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, వ్యవసాయ, విద్యుత్ శాఖలతోపాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను అనంతర పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం వివరాలపై ఆరా తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



తుపాను అనంతరం తీసుకుంటున్న ఉపశమన చర్యలు, ఆస్తి, పంట నష్టం అంచనాలపై దిశా నిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు ప్రభావితం అయినట్టు కలెక్టర్ షాన్ మోహన్ వివరించారు. మొత్తం 61 ఇళ్లు దెబ్బ తినగా, 41,932 కుటుంబాలపై మొంథా ప్రభావం చూపినట్టు తెలిపారు. అందులో 27,624 మత్స్యకార, 313 చేనేత కుటుంబాలు ఉన్నట్టు చెప్పారు. 21,711 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, 668 ఎకరాల్లో అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మొత్తం 33,596 మంది రైతులు తుపాను కారణంగా నష్టపోయినట్టు తెలిపారు. విద్యుత్ పరికరాలు, రోడ్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే వరి, ఉద్యాన పంటలు కలిపి 2,500 మంది రైతులు వరకు పంటలు నష్టపోయినట్టు చెప్పారు. అంతటా ఉపసమన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

## అమెరికా-భారత్ మధ్య కీలక
## రక్షణ ఒప్పందం

-ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం
-పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం చేసిన ఇరుదేశాలు
-రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి




అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.




# ఫలించిన చర్చలు..

## ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

-ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇటీవల నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు
-కొనసాగించేందుకు అంగీకరించిన యాజమాన్యాలు-ప్రభుత్వంతో జరిగిన చర్చలు విజయవంతం
-బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సర్కార్ -కొద్దిరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోగులకు ఊరటనిచ్చే వార్త. కొద్దిరోజులుగా ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. పెండింగ్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు మధ్య నెలకొన్న వివాదం పరిష్కారమైంది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సేవలను కొనసాగించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. గత కొంతకాలంగా తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో వైద్యం అందక అనేకమంది అవస్థలు పడ్డారు

ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాలతో




చర్చలు జరిపింది. యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన ప్రైవేటు ఆసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించడానికి అంగీకరించాయి. దీంతో రోగులు యథావిధిగా ఈ సేవలను వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది.

# మొంథా తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి


ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయానికి తుపాను బారినపడింది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి రాకుండా పోయింది. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకీ ప్రభుత్వం నుంచి పరిహారం అందాలి. కష్టంలో ప్రభుత్వం మాకు తోడుందని రైతు సంతృప్తి చెందేలా యంత్రాంగం చర్యలు ఉండాలి. ముఖ్యంగా పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలచి పక్కాగా నివేదికలు రూపొందించాలి. దీంతోపాటు ఆస్తి నష్టం వివరాలు కూడా రూపొందించాలి. దెబ్బ తిన్న ఇళ్లకు తక్షణం పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలి. తుపాను అనంతరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. గ్రామాల వారీగా పారిశుధ్య కార్యక్రమాలు ఎంత వరకు వచ్చాయో ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించండి. ఎంత మేర రోడ్లు దెబ్బతిన్నాయో గుర్తించి, పాక్షికంగా దెబ్బ తిన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

**- తీర ప్రాంతం మొత్తం తాత్కాలిక రాళ్ల గోడ నిర్మాణానికి చర్యలు**

ఉప్పాడ తీర ప్రాంతంలోని సుబ్బంపేట వద్ద సముద్ర కోత నుంచి రక్షణకు రాళ్లతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేశాం. ఇది సముద్రపు కోతను నిలువరించగలిగింది. మిగిలిన తీర ప్రాంత గ్రామాలకు కూడా ఈ రాళ్ల గోడ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. శాశ్వత రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యే వరకు ఇది తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కల్పిస్తుంది. తీర ప్రాంత గ్రామాల రక్షణకి ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలి అన్నారు.

**- పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితులపై సమీక్ష...**

ఈ సందర్భంగా మొంథా తుపాను అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితులపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. కోతకు గురవుతున్న ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట, అమీనాబాద్, సుబ్బంపేటల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయని అధికారుల ద్వారా తెలుసున్నారు. మొంథా తుపాను పిఠాపురం నియోజక వర్గం మొత్తం ప్రభావం చూపింది. తుపాను అనంతరం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చింది. పిఠాపురం పట్టణం పరిధిలోని కరివేపాకు పేట ప్రాంతం వద్ద పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు ఇంకా నిలిచి ఉన్నట్టు తెలిసింది. ఆ నీటిని తక్షణం బయటికి పంపే ప్రయత్నం చేయాలి. దోమలు పెరిగి,



వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యపు చర్యలు చేపట్టాలి. అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్న చోట వైద్య శాఖను అప్రమత్తం చేయాలి. ఏలేరు కాలువ గొర్రెకండె గట్టు వద్ద కొంత బలహీనంగా ఉన్నట్టు తెలిసింది. ముంపు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన కాలువ గట్లు పటిష్టపరచండి. తుపాను కారణంగా మల్లవరం ప్రాంతంలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పత్తి పంట నష్టంపై తక్షణం అంచనాలు రూపొందించి వారికి న్యాయం జరిగేలా చూడాలి అని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ రాజీలేని పోరాటం

## -ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు అందె అశోక్

చేర్యాల,నవంబర్01

కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న గొప్ప కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అందె అశోక్ అన్నాడు.శుక్రవారం కార్మిక సంఘం 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద కార్మిక సంఘం జెండాను ఆయన ఆవిష్కరించాడు.అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర కార్మిక సంఘం ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయి నగరంలో పురుడు పోసుకున్నదన్నారు.మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో కార్మిక గర్జవల నుండి ఏఐటీయూసీ ఆవిర్భవించిందని,భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం అందరికన్నా ముందే నినదించిన ఏకైక సంఘం ఏఐటీయూసీ,దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరు కలిపిన మొనగాడి సంఘం కార్మిక హక్కుల కొరకు జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం అలుపెరగని పోరాటాలు చేసి కార్మిక వర్గం నేడు అనుభవిస్తున్న సౌకర్యాలను అమల్లో ఉన్న చట్టాలను అన్నిటినీ సాధించిందన్నారు.నేడు భారతదేశంలో కార్మిక వర్గం నెత్తురు చిందించి ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర ఉందన్నారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతుందన్నారు.ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు.దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ రంగాలను పరిరక్షించేందుకు కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జంగిలి యాదగిరి,కత్తుల భాస్కర్ రెడ్డి,నంగి కనకయ్య,పొన్నబోయిన మమత,సుంకోజు రజిత,పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి,చింతల నరేష్,నంగి సత్తయ్య,మల్లిగారి నరసింహులు,సకినాల








# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి,ఎంపీ

రాయికోడ్ 31అక్టోబర్)

సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ మాజీ ఎంపీటీసీ పార్వతి-కేదరినాథ్(తాజా మాజీ సర్పంచ్) కుమార్తె నవ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంగ అశోక్ పటేల్ కుమారుడు కిషోర్ వివాహం శుక్రవారం నల్లంపల్లి చౌరస్తా లోని పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది, ఈ వివాహానికి వైద్య ఆరోగ్య %డ% సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ జైపాల్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,మాజీ డిసియంఎస్ చైర్మన్ సిద్దన్న పాటిల్, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సిములు,ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మండల యూత్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి,మాజీ యువత అధ్యక్షులు అవుసలి ప్రభాకర్,సీనియర్ నాయకులు మొహమ్మద్ రఫిక్ మియా,జంబ్గి నవీన్,రాజు కుర్మ, ప్రవీణ్ పటేల్ అంబన్న,ప్రవీణ్ పటేల్, నాయకులు,అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏక్తా దివాస్ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

రాయికోడ్ 31అక్టోబర్)



సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివాస్ లో భాగంగా ప్రజల మధ్య ఐకమత్యం, సౌభ్రాతృత్వం మరియు సామాజిక సమగ్రతను పెంపొందించే ఉద్దేశ్యంతో శుక్రవారం ఎస్సై చైతన్య కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఐక్యత కోసం పరుగు(రన్ ఫర్ యూనిటి) కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు,పెద్దలు,యువకులు,పాఠశాల విద్యార్థులు,సిబ్బంది, మీడియా ప్రతినిధులు తదితరులు మార్కెట్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ఎంతో ఉత్సహంతో ఐకమత్యంగా పరుగు తీయడం జరిగింది.

# నూతన వధూ వరులను ఆశీర్వదించిన మాజీ ఎంఎల్ఏ చంటి క్రాంతి కిరణ్

రాయికోడ్ 31అక్టోబర్)



సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని జంబ్గి( కే) గ్రామానికి చెందిన బిఆర్ ఎస్ నాయకులు బేలూరీ బస్వరాజు రెడ్డి కూతురు వైష్ణవి వివాహం లింగంపల్లి లోని శ్వేత గార్డెన్ లో సాయివర్ధన్ రెడ్డి తో ఘనంగా జరిగింది. ఈ యొక్క వివాహ వేడుకకు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జైపాల్ రెడ్డి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,గ్రామా అధ్యక్షుడు రత్నారెడ్డి, రమేష్ మరియు గ్రామనికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఐక్యత పరుగు





నాగల్ గిద్ద ప్రతినిధి

నాగల్ గిద్ధ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ కాశీపురం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా నాగల్ గిద్ధ మండల కేంద్రం నుండి పోలీస్ స్టేషన్ వరకు "ఐక్యత పరుగు"ను జెండా ఊపి ప్రారంభం చేసినారు.సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ కాశీపురం ఈ ఐక్యత పరుగు పందెంలో విజయం సాధించిన జూనియర్, సీనియర్లకు శాలువాతో సన్మానం చేసి బహుమతులు అందజేసినారు.ఈ ఐక్యత పరుగు పందెంలో విజయం సాధించిన ప్రథమ స్థానంలో నిలిచిన అంబేద్కర్ పూలే సేవ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై. పండరి, ద్వితీయ స్థానం సంపాదించుకున్న గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంత్ రావు, జూనియర్ పరుగుపందెంలో విజయం సాధించిన యం. విష్ణు, కుమ్మరి అంబధాస్ కు శాలువాతో సన్మానం చేసి బహుమతులు అందజేసినారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ఐక్యత పరుగు కార్యక్రమం ద్వారా జాతి ఐక్యత, దేశభక్తి వంటి విలువలను ప్రోత్సహించడం మా ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ ఐక్యత పరుగుపందెంలో గ్రామ ప్రజలు, విద్యార్థులకలు, ప్రభుత్వ ఉద్యోగులు, అలాగే యువత పాల్గొని విజయవంతం చేసినారు. .

# హైదరాబాద్ సిపి విసి సజ్జనార్ ను కలిసిన అయిదాల సునీల్

సంగారెడ్డి ప్రతినిధి)



హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన విసి సజ్జనార్ ఐపీఎస్ ను జహీరాబాద్ మండలం రాయిపల్లి 'డి' గ్రామానికి చెందిన ప్రముఖ గాయకులు అయిదాల సునీల్ హైదరాబాద్ లోని తన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అయిదాల సునీల్ రచించిన రోడ్డు భద్రత నియమాలు, డ్రగ్స్ మరియు యువత కోసం రచించిన పాటలు సజ్జనార్ కి వినిపించగా సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో సైబర్ క్రైమ్ మరియు బెట్టింగ్ ప్రమాదాలపై మరో పాట ను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సజ్జనార్ ను కలిసిన వారిలో అయిదాల సునీల్ తో పాటు జహీరాబాద్ కు చెందిన జానీ మరియు సిమోన్ లు ఉన్నారు

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

**- సమాజ రక్షణలో పోలీసుల పాత్ర అమూల్యం**

**- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**






రావులపాలెం, సింహగర్జన ప్రతినిధి, అక్టోబర్ 31 : సమాజ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు %-% ఆస్తుల సంరక్షణలో పోలీసుల సేవలు విశేషమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ అమరవీరుల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా రావులపాలెం ఎంకేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏవీఆర్ పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీకృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన ఆలమూరు ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ సేవలను ఆయన స్మరించారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ దేశ సమగ్రత ప్రజల రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం అమూల్యం. సమాజం భద్రంగా ఉండేందుకు వారి కుటుంబాలను కూడా లెక్కచేయకుండా పనిచేస్తున్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండేది పోలీసులే అని అన్నారు. అలాగే ఇటీవల తుఫాను ఇబ్బందుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన పోలీసు సిబ్బందిని ప్రశంసించారు. రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో రావులపాలెం పట్టణంలో బృహత్తర రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లాంఛనంగా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్పీ రాహుల్ మీనా స్వయంగా రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ సేవలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం మన అందరి బాధ్యత. పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణకే కాకుండా సామాజిక సేవలో కూడా ముందుంది. ప్రజల మేలు కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది అని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# తుఫాను బాధితులకు కూరగాయలు పంపిణీ

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, అక్టోబర్ 31 :
పిఠాపురం పట్టణం స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో జనసేన నాయకులు జిలకర గోవిందు నిరాశ్రయులైన పేదలకు కూరగాయలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో జనసేన నాయకులుగా పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఆయన చేసిన సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కాలేకపోయినా జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ ఆదేశాలతో మొంథా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన రెండు వందల కుటుంబాలకు కూరగాయలు, పాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి నాగేశ్వరరావు, గుండు బోయిన సూరిబాబు, మైనవరపు ఈశ్వరరావు, నాగేశ్వరరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 393 అంబాసిడర్ తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం సీబీఎన్



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారును పరిశీలించి, ఆ కారుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 393 నెంబరుతో ఉండే ఈ అంబాసిడర్ కారు చంద్రబాబు నాయుడు సొంత వాహనం. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా 393 నెంబర్ ఉన్న అంబాసిడర్ కాన్వాయిలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేవారు. 393 అంబాసిడర్ అంటేనే సీబీఎన్ బ్రాండ్ కార్ అనేలా ఈ కారు గుర్తింపు పొందింది. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు... భద్రతా పరంగా ఆధునిక వాహనాలు వినియోగిస్తున్నా... తన సొంత కారు అయిన నాటి అంబాసిడర్ ను మాత్రం అపురూపంగానే చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాదులో ఉన్న ఈ కారును అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇకపై ఉంచనున్నారు. పార్టీ కార్యాలయానికి వచ్చి... తిరిగి వెళ్తున్న సమయంలో ఆనాడు తాను వాడిన అంబాసిడర్ కారును చంద్రబాబు పరిశీలించి... ఆ కారులో తన ప్రయాణ స్మృతులను గుర్తు చేసుకున్నారు.

# శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవం

**- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్, ఏపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు**





తాడేపల్లి, సింహగర్జన ప్రతినిధి, అక్టోబర్ 31 : మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామివార్ల ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఏపిఎంఎస్ఐడిసి చైర్మన్ %c% జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ మరియు నాయకులను గ్రామస్తులు, ఆలయ పునఃనిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు బాణసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయ పునర్నిర్మాణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యాదివాసంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, గుంటూరు జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి ఐదే కోమలి, ఎంటిఎంసి జనసేన పార్టీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, తాడేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, మంగళగిరి జనసేన సీనియర్ నాయకులు దాసరి శివ నాగేంద్ర, తిరుమలశెట్టి కొండలరావు, ఎంటిఎంసి జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ కైరుల్లా, ఎంటిఎంసి జనసేన కార్యదర్శి %c% మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు తిరుమలశెట్టి మురళీకృష్ణ, ఎంటిఎంసి జనసేన కార్యదర్శి బళ్ళ ఉమామహేశ్వరావు, జనసేన నాయకులు తుమ్మపూడి నరసింహారావు, చిట్టెం అవినాష్, తాడేపల్లి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పసుపులేటి అశోక్, తాడేపల్లి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, లాల్ చంద్, తాడేపల్లి మండల జనసేన పార్టీ కార్యదర్శి జగదీష్, కుంచనపల్లి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు మేకల రాజా, ఉండవల్లి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు రాజా రమేష్, చిర్రావూరు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు కాశీ కృష్ణ, జనసేన వీర మహిళ పావని, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం.

**- పారదర్శకంగా చెక్కుల పంపిణీ- కూటమి అధికారంలోకి వచ్చాక**

**22 దఫాలుగా రూ.4.44 కోట్ల చెక్కుల పంపిణీ- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, అక్టోబర్ 31 : సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి వర్గాల వారికి ఉపశమనంగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ తో అర్హులందరికీ పారదర్శకంగా చెక్కులు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 22 దఫాలుగా రూ. 4.44 కోట్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా 7గురికి రూ. 10,50,829ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, జక్కంపూడి బాలాజీ, సూరపరెడ్డి సత్య మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ అంటే ఈయనే

**- ఇతరఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు పోలీసింగ్**

**- ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం**

**- అటువంటి పోలీసింగ్ చేయటంలో ఆయన తీరే వేరు**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, అక్టోబర్ 31 : నేరస్తులను పట్టుకోవటంలో నే కాదు... ప్రకృతి విపత్తులలోను సమాజాన్ని కాపాడటంలో ముందుంటారని మరోసారి రుజువు చేశారు కొత్తపేట సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సుంకర మురళి మోహన్ అండ్ టీం. ప్రస్తుత కొత్తపేట డిఎస్పిగా ఉన్న సుంకర మురళి మోహన్ కొత్తపేట ఎస్సైగా ఉన్న సమయంలో 1996 నవంబర్ 6 తారీఖున అతి భయంకరమైన తుఫాను కోనసీమను కకావికలం చేసింది. 1996 భయంకరమైన తుఫాన్ సమయంలో కోనసీమ కొత్తపేట ప్రాంతంను మాములు స్థితికి తీసుకురావటంలో ముఖ్య భూమిక పోషించారు సుంకర మురళి మోహన్. అటు అంతర్వేది నుండి శంకరగుప్తం, కరువాక వరకు తీరప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటు ప్రాణాల అరచేత పట్టుకుని గడుపుతున్న క్షణాల్లో నేనున్నా అంటూ వారికి ధైర్యం చెప్పి రాత్రంతా గస్తీ కాస్తూ, తీర ప్రాంత ప్రజలతో మమేకమై తన టీమ్ ను ముందుండి నడిపించారు. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని, మొంథా తూఫాన్ తీరం దాటుతున్న సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండాగాని, జనజీవనం ఇబ్బంది పడకుండా రోడ్లను క్లియర్ చేయటంలో గాని, విద్యుత్, రెవెన్యూ, మెడికల్, తాగునీరు, పోలీసు వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ తనదైన శైలిలో జన జీవన స్రవంతిని అస్తవ్యస్తం కాకుండా చూడటంలో ఆయన చూపించిన చొరవ మరువలేనిది. పోలీసింగ్ చేయటంలో ఆయన తీరే వేరు. విధి నిర్వహణలో ఎక్కడ తల్గొగ్గకుండా, సమాజం కోసం నేనున్నాను అంటూ ప్రజల్లో పోలీస్ అంటే ఒక ప్రత్యేకమైన ముద్ర వేశారు. అంతేకాదు ఎవరు కష్టాల్లో ఉన్నామని వెళ్లినా... లేదా ఆయన దృష్టికి వచ్చినా లేదనకుండా సాయం అందించటంలో ముందుంటారు. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేసి పేపర్లో వేయించుకుందాం, వాటిని అందుకునే వాళ్ళు చాలా బాధ పడతారని అందువల్ల నాకు ఇష్టం ఉండదని, ఎవరికి ఎంత సాయం చేసినా ఎక్కడా తన పేరు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు సుంకర మురళీమోహన్.



# నవంబర్ 2న నగర సంకీర్తన

జహీరాబాద్, అక్టోబర్ 31)
జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నవంబర్ 2 న ఆదివారం ఉదయం 6 గంటలకు స్థానిక స్వర్ణకారుల మార్కెట్ లోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో 179వ నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదట హరేకృష్ణ మహామంత్ర జపం తో కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రభుపాదుల వారి ప్రార్థన, శ్రీ కృష్ణ కీర్తనలు, కార్తీక మాసంలో ప్రతిరోజు సాయంత్రం జరిగే దామోదర దీప హారతి లో పాల్గొనలేని వారికి దామోదర దీపారాధన, తులసి హారతి సౌకర్యం కల్పించనున్నట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభుజీ ద్వారా సత్సంగ ప్రవచనం, నరసింహ ఆరతి ఉంటాయన్నారు. భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో సంకీర్తన కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అదే రోజు సాయంత్రం దామోదర హారతి, తులసి పూజ, తదనంతరం భక్తులకు ప్రసాదం అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోనూ ఆ గ్రామ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో అదే రోజు ఉదయం 7 గంటలకు గ్రామం లోని ఆంజనేయ స్వామి ఆలయంలో 144వ పల్లె సంకీర్తన జరుగుతుందని వివరించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా సంకీర్తన చేస్తూ కృష్ణ కీర్తనలు, సత్సంగం, ఇత్యాది కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com